సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
శనివారం ¦ 30 ¦ డిసెంబర్ ¦ 2023



### టమాట కిలో రూ.16

కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్ట ధర రూ.16 పలికింది. కనిష్టం రూ.6, సరాసరి రూ.12 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



### మద్దతు ధరతో కందుల కొనుగోలు

రైతుల నుంచి మద్దతు ధరతో కందులను ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేయనున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు తెలిపారు.

8లో

గరిష్టం/కనిష్టం
33.7°/ 13.6°

జిల్లాలో శుక్రవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం చలి తీవ్రత బాగా పెరిగింది. ఆగ్నేయం దిశగా గంటకు 4 నుంచి 6 కిలో మీటర్ల వేగంతో గాలి వీచింది.



జై జగన్.. నినదిస్తున్న కార్యకర్తలు



అనంతపురంలో సామాజిక సాధికార బస్సుయాత్రలో మాట్లాడుతున్న మాజీ మంత్రి పేర్ని నాని, చిత్రంలో డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా, మంత్రి ఉషశ్రీచరణ్, ఎమ్మెల్యే అనంత, ప్రభుత్వ సలహాదారు జూపూడి, గిరిజమ్మ, పైలా

# సాధికార సంబరం



జగనన్నా.. మా అండ నీవేనన్నా

నవరత్నాల పథకాలు, రాజకీయ, నామినేటెడ్ పదవుల్లో లబ్ధి పొందిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలు సాధికార సింహనాదం చేశాయి. ఉన్నత చదువులను పేదింటి పిల్లల దరిచేరుస్తూ.. అవ్వాతాతలను మనవడిలా వెంట ఉండి నడిపిస్తూ వారి పింఛన్లతో సామాజిక భద్రత కల్పిస్తూ, అక్కచెల్లెమ్మల ఆర్థిక సాధికారతకు ఊతమిస్తూ ముందుకు సాగుతున్న జగనన్ననే మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చాయి.



అనంతపురంలోని పాతూరు గాంధీ విగ్రహం వద్ద నిర్వహించిన సభలో పాల్గొన్న అశేష జనవాహినిలో ఒక భాగం

## 'అనంత'లో సామాజిక సాధికార యాత్రకు భారీ జనం

- ప్రతిధ్వనించిన జగన్నినాదం

అనంతపురం/అనంతపురం కార్పొరేషన్: సామాజిక సాధికార యాత్ర సంబరం అంబరమంటింది. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు సీఎం వైఎస్ జగన్ చేసిన మంచిని వివరించి, వారిలో చైతన్యం నింపే లక్ష్యంతో వైఎస్సార్‌సీపీ చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్ర శుక్రవారం అనంతపురంలో విజయవంతమైంది. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో ఆర్‌అండ్‌బీ అతిథి గృహం నుంచి యాత్ర ప్రారంభమైంది. ఈ సందర్భంగా ముఖ్య అతిథి డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్, రాష్ట్ర ప్రభుత్వ సామాజిక న్యాయ సలహాదారులు జూపూడి ప్రభాకర్‌రావుతో పాటు ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే అనంత తదితరులు గీతా మందిరం సమీపంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి, పాతూరు మార్కెట్ గాంధీ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన సభా స్థలికి బయలుదేరారు. సప్తగిరి సర్కిల్‌లో ముఖ్య అతిథులకు పార్టీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్ ఆధ్వర్యంలో క్రేన్ సహాయంతో గజమాల వేయించి స్వాగతించారు. దారి పొడవునా మహిళలు, చిన్నారులు పూల వర్షం కురిపించారు. అమ్మవారిశాల వద్ద ఆర్యవైశ్య సంఘం నాయకులు ప్రజాప్రతినిధులకు పూలమాల వేసి స్వాగతం పలకగా.. వైఎస్సార్‌సీపీ నాయకులు బండి శ్రీకాంత్ ఆధ్వర్యంలో బాణసంచా పేల్చారు. సభా వేదికపై ముఖ్య అతిథులతో పాటు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు తదితరులు ఆసీనులయ్యారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వాసంతి సాహిత్య, ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీం అహమ్మద్, అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్న, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల, టీటీడీ బోర్డు సభ్యులు అశ్వత్థ నాయక్, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ లిఖిత, పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులు ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి, సైఫుల్లాబేగ్, ఎగ్గుల శ్రీనివాసులు, కొర్రపాడు హుస్సేన్‌పీరా, సాంస్కృతిక విభాగం జోనల్ ఇన్‌చార్జ్ రిలాక్స్ నాగరాజు, మహిళా విభాగం జిల్లా ఉపాధ్యక్షురాలు రాధా యాదవ్, నగర అధ్యక్షురాలు కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

### భారీ బైక్ ర్యాలీ

కార్పొరేటర్ సాకే చంద్రశేఖర్, వైఎస్సార్‌సీపీ యువజన నాయకుడు అనంత లిఖిత్‌రెడ్డి ఆధ్వర్యంలో బస్సు యాత్రకు మద్దతుగా అంబేడ్కర్ విగ్రహం నుంచి బహిరంగ సభ స్థలి వరకు భారీ బైక్ ర్యాలీ చేపట్టారు. అలాగే బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్ ఆధ్వర్యంలో వివిధ కులసంఘాల నాయకులు ర్యాలీగా బహిరంగ సభకు విచ్చేశారు.

### ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

సభ ప్రారంభానికి ముందు సాంస్కృతిక విభాగం జోనల్ ఇన్‌చార్జ్ రిలాక్స్ నాగరాజు బృందం నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.



అనంతపురంలో సామాజిక సాధికార బస్సు యాత్ర..



సభకు భారీగా తరలివచ్చిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల ప్రజలు

### రూ.800 కోట్లతో 'అనంత' అభివృద్ధి



నాలుగున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో అనంతపురం నియోజకవర్గంలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారులకు రూ.2వేల కోట్లు వారి బ్యాంకు ఖాతాలకు జమ చేశామని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. అందులో సింహభాగం బడుగు, బలహీన వర్గాల వారికే దక్కిందన్నారు. సంక్షేమం అంటే ఉచిత పథకం కాదని, లబ్ధిదారుల కుటుంబాలు మారడంతో పాటు వారి పిల్లల తలరాత మారాలన్న దార్శనికుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. నగరంలో రూ.800 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. అంబేడ్కర్ కోరుకున్న సామాజిక సాధికారతను సీఎం జగన్ నిజం చేసి చూపారన్నారు.

# ఉన్నత భవితకు బాటలు

- విద్యాదీవెనతో వేలాది కుటుంబాల్లో వెలుగులు
- మెగా చెక్కు పంపిణీలో కలెక్టర్ అరుణ్‌బాబు
- జిల్లాలో 29,491 మంది విద్యార్థులకు లబ్ధి



లబ్ధిదారులకు మెగా చెక్కు అందజేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

**పుట్టపర్తి అర్బన్:** 'పేదల తలరాతలు మార్చి ఆయా వర్గాల్లోని విద్యార్థుల ఉన్నత భవితకు బాటలు వేసేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి 'జగనన్న విద్యాదీవెన' పథకం అమలు చేస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులతో ఏ విద్యార్థీ ఉన్నత చదువులకు దూరం కాకూడదన్న ఉద్దేశంతో ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్ తదితర కోర్సులు చేసే నిరుపేద కుటుంబాల్లోని విద్యార్థులకు ఆర్థికంగా అండగా నిలుస్తున్నారు'' అని కలెక్టర్ అరుణ్‌బాబు అన్నారు. శుక్రవారం పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో జరిగిన సభలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కంప్యూటర్ బటన్ నొక్కి 'జగనన్న విద్యాదీవెన' (జూలై, ఆగస్టు, సెప్టెంబర్ త్రైమాసికం) నిధులను అర్హులైన తల్లుల ఖాతాల్లో జమ చేశారు. స్థానికంగా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ అరుణ్‌బాబు, జిల్లా అగ్రి అడ్వైయిజరీ బోర్డ్ చైర్మన్ అవుటాల రమణారెడ్డి, 'పుడా' చైర్ పర్సన్ లక్ష్మీనరసమ్మ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ అధికారులు శివరంగ ప్రసాద్, మోహన్‌రాం తదితరులు విద్యార్థుల తల్లులకు మెగా చెక్కును అందజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, సీఎం వైఎస్ జగన్ మహోన్నత లక్ష్యంతో విద్యాదీవెన పథకాన్ని ప్రారంభించారన్నారు. నాలుగేళ్లుగా ప్రతి త్రైమాసికానికీ నిధులు జమ చేస్తూ నిరుపేద కుటుంబాల్లోని విద్యార్థులకు అండగా నిలుస్తున్నారన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకుని ప్రతి విద్యార్థీ ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. తల్లులు కూడా తమ ఖాతాల్లో జమ అయిన విద్యా దీవెన సొమ్ము డ్రా చేసి కళాశాలల్లో చెల్లించాలని, అదే సమయంలో విద్యార్థుల హాజరు, ప్రగతి గురించి ఆరా తీయాలన్నారు.

**ఖాతాల్లో రూ.20 కోట్ల జమ..**

జిల్లాలో ఐటీఐ, పాలిటెక్నిక్, ఇంజినీరింగ్, మెడిసిన్, డిగ్రీ చదువుతున్న అర్హులైన 29,491 మంది విద్యార్థులకు సంబంధించి వారి తల్లుల ఖాతాల్లో రూ.20,00,72,592 జమ చేశారు. ఇందులో ఈబీసీ కింద 2,694 మంది విద్యార్థులకు రూ.2.34 కోట్లు, ఎస్సీ సంక్షేమం కింద 5,287 మంది విద్యార్థుల ఖాతాల్లో రూ.3.87 కోట్లు, ఎస్టీ సంక్షేమం కింద 1,834 మంది విద్యార్థుల ఖాతాల్లో రూ.1.26 కోట్లు, బీసీ సంక్షేమం కింద 14,895 మంది విద్యార్థుల ఖాతాల్లో రూ.9.52 కోట్లు, కాపు సంక్షేమం కింద 2,181 మంది ఖాతాల్లో రూ.1.47 కోట్లు, ముస్లిం మైనార్టీ వర్గాల్లోని 2,575 మంది విద్యార్థుల ఖాతాల్లో రూ.1.44 కోట్లు, క్రిస్టియన్ మైనార్టీ వర్గాల్లోని 25 మంది విద్యార్థుల ఖాతాల్లో రూ.17 లక్షలు జమ చేశారు.

### ఫీజుకు ఇబ్బందిలేదు



నేను ఐటీఐ మొదటి సంవత్సరం చదువుతున్నా. మాది పూర్తిగా వ్యవసాయ కుటుంబం. మానాన్న సేద్యం చేస్తూ నన్ను చదివిస్తున్నారు. సకాలంలో పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయడంతో కళాశాలలో ఇబ్బంది లేకుండా ప్రశాంతంగా చదువుకోగలుగుతున్నా. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

– బలరామిరెడ్డి, ఐటీఐ విద్యార్థి, నల్లమాడ

### ప్రోత్సాహం మరువలేనిది



టీచర్ కావాలన్న నా ఆశయ సాధనకు జగనన్న అందిస్తున్న ప్రోత్సాహం మరువలేనిది. గతంలో ఏ ప్రభుత్వమూ ఇలాంటి పథకాలు అమలు చేయలేదు. మా కుటుంబానికి అర్హతే ఆధారంగా మరిన్ని పథకాలు అందుతున్నాయి. సీఎంకు జీవితాంతం రుణపడి ఉంటాం.

– సుమియా తస్నీర్, డైట్ కళాశాల, బుక్కపట్నం

### ఉజ్వల భవితకు నాంది



విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం ఏర్పాటు చేసిన జగనన్న విద్యా దీవెన పథకం నాలాంటి పేద విద్యార్థులకు అండగా నిలుస్తోంది. గతంలో 'జగనన్న అమ్మఒడి' ద్వారా చదివాను. ప్రస్తుతం విద్యాదీవెనతో కళాశాల విద్య కొనసాగిస్తున్నా. జగనన్న ఇలాగే పదికాలల పాటు సీఎంగా ఉంటే నాలాంటి ఎందరో విద్యార్థుల జీవితాల్లో వెలుగులు వస్తాయి.

– దివ్య, ల్యాబ్ టెక్నీషియన్, పుట్టపర్తి

## క్లుప్తంగా

### 31న సాయి ప్రూడెంట్ స్కాలర్‌షిప్ టెస్ట్



పోస్టర్లు విడుదల చేస్తున్న డాక్టర్ సెంథిల్‌కుమార్, సిబ్బంది

**ప్రశాంతి నిలయం:** నాలుగేళ్ల బీటెక్ కోర్సును ఉచితంగా అభ్యసించేందుకు సంస్కృతీ విద్యాసంస్థ, జర్మనీకి చెందిన అన్‌హట్టా స్టిఫ్‌స్టంగ్ స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 31న జరిగే సంస్కృతీ సాయి ప్రూడెంట్ టెస్ట్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విద్యార్థులకు సంస్కృతి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సెంథిల్‌కుమార్ పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను శుక్రవారం ఆయన విడుదల చేసి, మాట్లాడారు. పూర్తి వివరాలకు 99945 50177లో సంప్రదించాలని కోరారు.

### క్రీడాకారులను ప్రోత్సహించడమే ప్రభుత్వ లక్ష్యం



టాస్ వేసి పోటీలను ప్రారంభిస్తున్న డీఎస్‌డీఓ ఉదయభాస్కర్

**గోరంట్ల:** ఔత్సాహిక క్రీడాకారులను ప్రోత్సహించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని చేపట్టిందని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి ఉదయ్‌భాస్కర్ అన్నారు. గోరంట్లలోని బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శుక్రవారం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. షటిల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా క్రికెట్, ఖోఖో, వాలీబాల్, కబడ్డీ, షటిల్ బ్యాడ్మింటన్ ఐదు క్రీడల్లో వందలాది మంది బాలబాలికలు, యువతీ యువకులు ఉత్సాహంగా పాల్గొంటున్నారన్నారు. విజేతలు రాష్ట్ర స్థాయిలోనూ రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీఈటీలు, క్రీడాకారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అనంత వాసికి అత్యున్నత గౌరవం



బిసాటి భరత్

**అనంతపురం కల్చరల్:** గతంలో అనేక సందర్భాలలో అనంత ఖ్యాతిని చాటుతూ జాతీయ వేదికలపై రాణించిన జిల్లాకు చెందిన బిసాటి భరత్ మరో జాతీయ అత్యున్నత పురస్కారానికి ఎంపికయ్యారు. జనవరి 12న స్వామి వివేకానంద జయంతి సందర్భంగా మహారాష్ట్రలోని నాసిక్‌లో జరిగే 27వ జాతీయ యువజనోత్సవాల్లో ప్రధాని మోదీ చేతుల మీదుగా అవార్డునందుకోనున్నారు. ఈ మేరకు భారత ప్రభుత్వం తరఫున యువజన వ్యవహారాల శాఖ సమాచారాన్ని వెలువరించింది. పుట్లూరు మండలం కందికాపులకు చెందిన ఆదినారాయణ, చంద్రికాదేవి దంపతుల కుమారుడు భరత్ పుట్టింది నిరుపేద కుటుంబమే అయినా స్వీయ ప్రతిభతో రాణించి ఎస్కేయూ, ఇందిరాగాంధీ యూనివర్సిటీలలో రెండు పోస్టు గ్రాడ్యుయేషన్లు పూర్తి చేశారు. 2014 నుంచి ప్రగతి పథం యూత్ అసోసియేషన్ స్థాపించి నెహ్రూ యువకేంద్రం ద్వారా అనేక కార్యక్రమాల్లో విస్తృతంగా పాల్గొంటూ వచ్చారు. మై గవర్నమెంట్ జాతీయ ప్రచారకర్తగా ప్రభుత్వాలు అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాలపై గ్రామీణులకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయన రాష్ట్రపతి చేతుల మీదుగా ఎన్ఎస్ఎస్ అవార్డుతో పాటు మరెన్నో జాతీయ అవార్డులను, రివార్డులను అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను నెహ్రూ యువకేంద్ర డీడీఓ శ్రీనివాసులు, సాహిత్యభారతి గౌరవాధ్యక్షుడు డాక్టర్ పతికి రమేష్ నారాయణ, డాక్టర్ ఉమర్ ఆలీషా సాహితీ సమితి అధ్యక్షుడు పండిట్ రియాజుద్దీన్ అభినందించారు.

## కేటాయించిన లక్ష్యాలను చేరుకోవాలి



క్రెడిట్ ప్లాన్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, అధికారులు

- పాడి రైతులకు విరివిగా రుణాలు అందించాలి
- బ్యాంకర్లకు కలెక్టర్ సూచన

**పుట్టపర్తి అర్బన్:** కేటాయించిన లక్ష్యాలను త్వరితగతిన చేరుకోవాలని బ్యాంకర్లకు కలెక్టర్ అరుణ్‌బాబు సూచించారు. జిల్లా స్థాయి రివ్యూ కమిటీ (డీఎల్ఆర్‌సీ) శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిశ్రమలు, వ్యవసాయం, డీఆర్‌డీఏ, మెప్మా తదితర శాఖల అధికారులు సమన్వయంతో నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలన్నారు. ఆయా శాఖల పరిధిలోని వివిధ పథకాలకు అర్హులైన లబ్ధిదారులను గుర్తించి బ్యాంక్‌ల ద్వారా రుణాలు మంజూరు చేయించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలకు స్టాండప్ ఇండియా పథకం కింద విరివిగా రుణాలు అందించాలని బ్యాంకర్లను ఆదేశించారు. ఏ కారణం చేతనైనా రుణాలు ఇవ్వకున్నా, దరఖాస్తులను తిరస్కరించినా సంబంధిత నివేదికను తనకు పంపాలన్నారు. కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులను ప్రభుత్వం అందజేసిందని, వీటి ఆధారంగా వారికీ రుణాలు మంజూరు చేయాలని బ్యాంకర్లకు సూచించారు. 2024 మార్చి 31 నాటికి జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీలకు వంద శాతం రుణాలు అందజేయాలన్నారు. కోళ్లు, పొట్టేళ్లు, పందుల యూనిట్లకు సబ్సిడీ రుణాలను అందజేయాలన్నారు. అనంతరం నాబార్డ్ ఆధ్వర్యంలో పొటెన్షియల్ క్రెడిట్ ప్లాన్ అనే పుస్తకాన్ని కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్‌బీఐ ఓల్‌డీఓ పూర్ణిమ, నాబార్డ్ డీడీఎం అనురాధ, ఎల్‌డీఎం రమణకుమార్, ఏపీజీబీ బ్యాంకు ప్రతినిధి రవీంద్రారెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, మెప్మా పీడీ విజయలక్ష్మి, పశు సంవర్ధక శాఖ అధికారి శుభదాస్, పరిశ్రమల శాఖ జీఎం చాంద్ బాషా, జౌళి చేనేత శాఖ అధికారి రమేష్‌బాబు, ఉద్యాన శాఖ అధికారి చంద్రశేఖర్, డిక్కీ, ఫిక్కీ సభ్యులు పాల్గొన్నారు.

### ● నేత్రదానం



రాజ్యలక్ష్మి(ఫైల్)

**ధర్మవరం అర్బన్:** 'సర్వేంద్రియాణాం నయనం ప్రధానం' అన్నారు పెద్దలు. అంతటి ప్రధానమైన కళ్లను మరణించాక మట్టిపాలు చేసేకంటే, దానం చేస్తే మరో ఇద్దరికి కంటి చూపును ప్రసాదించినట్లవుతుందని విశ్వదీప సేవా సంఘం సభ్యులు చైతన్య పరచడంతో మృతి చెందిన తన భార్య డోలా రాజ్యలక్ష్మి నేత్రాలను దానం చేసేందుకు భర్త డీపీ నారాయణరెడ్డి ముందుకు వచ్చారు. ధర్మవరంలోని పార్థసారథి నగర్‌కు చెందిన రాజ్యలక్ష్మి (74) అనారోగ్యం కారణంగా శుక్రవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న విశ్వదీప సేవా సంఘం సభ్యులు నారాయణరెడ్డిని కలసి నేత్రదానం ఆవశ్యకతను వివరించారు. మరణానంతరం నేత్రాలను దానం చేయడం ద్వారా మరో ఇద్దరికి కంటి చూపు వస్తుందన్నారు. దీంతో తన భార్య నేత్రాలను దానం చేసేందుకు నారాయణరెడ్డి అంగీకారం తెలపడంతో హైదరాబాద్‌లోని ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి సిబ్బంది నాగరాజు అక్కడకు చేరుకుని రాజ్యలక్ష్మి మృతదేహం నుంచి నేత్రాలను సేకరించారు. నేత్రదానానికి అంగీకరించిన నారాయణరెడ్డి, ఆయన కుమారులు రాఘవేంద్రరెడ్డి, జయప్రకాష్ రెడ్డి, కోడలు రూప, ఇంజినీర్ శ్రీనివాసరెడ్డికి ఈ సందర్భంగా విశ్వదీప సభ్యులు సురేష్, శేఖరరెడ్డి, కేశవరెడ్డి తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

### హత్యాయత్నం కేసులో ఇద్దరికి జైలు

**కదిరి అర్బన్:** హత్యాయత్నం కేసులో ఇద్దరు ముద్దాయిలకు జైలు శిక్ష విధిస్తూ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి జయలక్ష్మి శుక్రవారం తీర్పు ఇచ్చారు. సీఐ సూర్యనారాయణ తెలిపిన మేరకు.. కదిరి మండలం చిప్పల మడుగు నివాసి పఠాన్ ఇబ్రహీంఖాన్ బోరు పైపులు చోరీ చేశాడన్న నెపంతో అదే గ్రామానికి చెందిన శంకర్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, లక్ష్మీనరసమ్మ 2018, జూలై 4వ తేదీన దాడి చేశారు. ఘటనలో ఇబ్రహీంఖాన్‌తో పాటు అతనికి మద్దతు పలికిన నారాయణ గాయపడ్డారు. ఘటనపై బాధితులు అదే రోజు కదిరి రూరల్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, హత్యాయత్నం కింద కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారించిన జడ్జి జయలక్ష్మి శుక్రవారం తుదితీర్పు చెప్పారు. శంకర్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డిలను ముద్దాయిలుగా పేర్కొంటూ నాలుగేళ్ల జైలు శిక్ష, రూ.20 వేల జరిమానా విధించారు.

### కోవిడ్‌తో యూకే వాసి మృతి

**ప్రశాంతి నిలయం:** యూనిటైడ్ కింగ్‌డమ్ పౌరసత్వం కలిగిన సత్యసాయి భక్తుడు భాస్కర్‌జోషి (75) కోవిడ్ లక్షణాలతో పుట్టపర్తిలో మృతిచెందారు. ఈ మేరకు డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్వీ కృష్ణారెడ్డి తెలిపారు. తన భార్య హేమాజోషీతో కలసి ఈ ఏడాది అక్టోబర్ 12న పుట్టపర్తికి చేరుకున్న ఆయన వెస్ట్‌గేట్‌లో ఉండే సాయిశ్వరీ అపార్ట్‌మెంట్‌లో అద్దెకుంటూ సత్యసాయి సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ఈ నెల 24న జ్వరం బారిన పడడంతో సత్యసాయి సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలో చేరారు. ఆయనకు ఇది వరకే గుండె సంబంధిత శస్త్ర చికిత్సలూ జరిగాయి. గురువారం ఆయన పరిస్థితి విషమిస్తుండడంతో వైద్యులు పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. ర్యాపిడ్ పరీక్షలో ఆయన కోవిడ్ పాజిటివ్ అని నిర్ధారణ అయింది. ఈ ఫలితాలను వైద్యుల చేతికి అందేలోపు ఆయన మృతిచెందారు. శుక్రవారం ఉదయం ఆయన మరణాన్ని వైద్యులు ధ్రువీకరించారు. భాస్కర్‌జోషీ మృతదేహాన్ని ఖననం చేసే సమయంలో పూర్తి జాగ్రత్తలు పాటించాలని సిబ్బందికి జిల్లా వైద్యాధికారి సూచించారు.

### మద్దతు ధరతో కందుల కొనుగోలు

**ధర్మవరం రూరల్:** రైతుల నుంచి మద్దతు ధరతో కందులను ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేయనున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు తెలిపారు. కందుల కొనుగోలు అంశంపై ధర్మవరం వ్యవసాయ డివిజన్‌లోని బత్తలపల్లి, ధర్మవరం, కనగానపల్లి, సీకేపల్లి, రామగిరి మండలాలకు చెందిన రైతు భరోసా కేంద్రాల సిబ్బంది, ఉద్యాన, పట్టు సహాయకులకు శుక్రవారం ధర్మవరంలోని ఎన్జీఓ హోంలో శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి సహాయ వ్యవసాయ సంచాలకులు క్రిష్ణయ్య, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ అశ్వత్థనారాయణ నాయక్, మార్క్‌ఫెడ్ డీఎం గీతతో కలసి డీఏఓ హాజరై మాట్లాడారు. కందుల కొనుగోలు యాప్‌పై అవగాహన కల్పించారు. క్వింటాకు రూ.7వేల మద్దతు ధరను ప్రభుత్వం చెల్లిస్తోందని, కూలీల ఖర్చు, రవాణా ఖర్చులనూ ప్రభుత్వమే భరిస్తోందని వివరించారు. ఈ అంశాలపై రైతులను చైతన్య పరచాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారులు ముస్తాఫా, రమాదేవి, ఓబిరెడ్డి, ఉదయ్ కుమార్, మురళి, కృష్ణకుమారి పాల్గొన్నారు.

## ఎన్నికలకు సన్నద్ధం కావాలి

- రౌడీషీటర్లు, ట్రబుల్‌మాంగర్లపై నిరంతర నిఘా ఉంచాలి
- నేర సమీక్షలో ఎస్పీ మాధవరెడ్డి



మాట్లాడుతున్న ఎస్పీ మాధవరెడ్డి

**పుట్టపర్తి టౌన్:** సార్వత్రిక ఎన్నికలకు పోలీసుశాఖలోని అన్ని విభాగాల సిబ్బంది సన్నద్ధం కావాలని ఎస్పీ మాధవరెడ్డి సూచించారు. విధుల్లో నిత్యం అప్రమత్తంగా ఉంటూ అసాంఘిక కార్యక్రమాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. శుక్రవారం ఆయన పోలీస్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో నెలవారీ నేర సమీక్షా నిర్వహించారు. వివిధ స్టేషన్ల పరిధిలో నమోదైన కేసులు, దర్యాప్తు తీరు, పురోగతి, ఇటీవల కోర్టుల్లో శిక్షలు పడిన కేసులపై ఎస్పీ మాట్లాడారు. అనంతరం గత మూడు నెలల కాలంలో జిల్లా పరిధిలో జరిగిన వీవీఐపీలు, వీఐపీల పర్యటనలు, ముఖ్యమైన సభలు, సమావేశాలకు భద్రతా ఏర్పాట్ల విధుల్లో పాల్గొన్న డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, సెబ్, డీపీఓ సిబ్బంది..కలిసి మొత్తంగా 153 మందికి ప్రశంసాపత్రాలు అందజేశారు.

**కౌన్సెలింగ్ ఇవ్వాలి:** అనంతరం ఎస్పీ మాధవరెడ్డి మాట్లాడుతూ, రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్లతో పాటు సమాజానికి ఇబ్బందులు కలిగించే వారికి క్రమం తప్పకుండా కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. వారి కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలన్నారు. ఆయా స్టేషన్ల పరిధిలో నమోదైన వివిధ కేసుల్లో దర్యాప్తు వేగవంతం చేసి ముద్దాయిలకు శిక్షలు పడేలా చూడాలన్నారు. కేసులు వీగి పోకుండా సాక్ష్యాధారాలు పక్కాగా కోర్టులో సమర్పించాలన్నారు. ఎఫ్ఐఆర్ నమోదులోనూ ఎలాంటి అలసత్వం ప్రదర్శించకూడదన్నారు. కేసులు పూర్తి చేసి పలు కేసుల్లో కోర్టు ఇస్తున్న తీర్పులను ఎప్పటికప్పుడు తెలుసుకొని అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రజలకు నమ్మకం కలిగేలా ప్రతి పోలీసూ విధులు నిర్వర్తించాలన్నారు. రోడ్డు ప్రమాదాలపై దృష్టి సారించి వాహన చోదకులను అప్రమత్తం చేస్తూ ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. లాడ్జిలు, హోటళ్లపై ప్రత్యేక నిఘా ఉండే విధంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించాలన్నారు. మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ అన్ని శాఖల సిబ్బందితో సమన్వయంతో పనిచేసి మంచి ఫలితాలు సాధించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ కేసుల దర్యాప్తు, స్పందన కార్యక్రమంలో స్వీకరించిన అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి బాధితులకు న్యాయం చేయాలన్నారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ విష్ణుతో పాటు అన్ని సబ్ డివిజన్ల డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.


## 22న ఓటరు తుది జాబితా



సమీక్షలో పాల్గొన్న కలెక్టర్, జేసీ తదితరులు

**పుట్టపర్తి అర్బన్:** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ–2024 అనంతరం ఓటరు తుది జాబితాను జనవరి 22న విడుదల చేయనున్నట్లు కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. శుక్రవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పెండింగ్ దరఖాస్తుల పరిస్థితి, ముసాయిదా జాబితా, ఓట్ల తొలగింపు, మార్పులు, చేర్పులు ఎపిక్ కార్డుల పంపిణీ తదితర అంశాలపై సమీక్షించారు. అనంతరం కలెక్టర్ అధికారులతో సమావేశమయ్యారు. జిల్లాలో రాజకీయ పార్టీల ప్రతినిధుల నుంచి అందిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. ఓటరు జాబితాకు సంబంధించి ఫారం 6, 7, 8 అభ్యంతరాలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేయాలన్నారు. కేంద్రాల్లో ర్యాంపుల సమస్య ఉండకూడదన్నారు. ఎన్నికల నిర్వహణకు ఎన్నికల కమిషన్ కొత్తగా హ్యాండ్ బుక్ రూపొందించిందని, ఆ మేరకు శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో జేసీ అభిషేక్ కుమార్, సబ్ కలెక్టర్ భరత్, డీఆర్‌ఓ కొండయ్య, పుట్టపర్తి, ధర్మవరం, కదిరి ఆర్డీఓలు భాగ్యరేఖ, రమేష్‌రెడ్డి, వంశీకృష్ణారెడ్డి, ఎన్నికల డీటీ మైనుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## పీహెచ్‌సీలో టాస్క్‌ఫోర్స్ తనిఖీలు



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ కుళ్లాయప్పనాయక్

**చిలమత్తూరు:** స్థానిక పీహెచ్‌సీని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ టాస్క్‌ఫోర్స్ బృందం శుక్రవారం తనిఖీ చేసింది. పలు రికార్డులను డీపీఎంఓ డాక్టర్ కుళ్లాయప్పనాయక్ బృందం పరిశీలించింది. కుష్ఠు నియంత్రణపై ఆశ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం దేమకేతేపల్లి పంచాయతీలోని కొర్లకుంట గ్రామంలో పర్యటించి విద్యార్థులకు, కౌమారదశ బాలికలకు, గర్భిణులు, బాలింతలకు రక్తహీనత పరీక్షలు నిర్వహించారు. గతంలో వచ్చిన రిపోర్టులతో బేరీజు వేసుకున్నారు. మాతాశిశు మరణాలు తగ్గించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం నిర్మాణ దశలో ఉన్న డాక్టర్ వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో డీపీహెచ్‌ఎన్ వీరమ్మ, ఎస్ఓ కలాధర్, వైద్యాధికారి నికేష్, పర్యవేక్షకులు గోపి, గోవిందప్ప, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## నిజజీవితంలో క్రీడలు ఎంతో ముఖ్యం



డ్యాన్స్ చేస్తున్న డీఐజీ అమ్మిరెడ్డి



బహుమతులు పొందిన క్రీడాకారులతో డీఐజీ అమ్మిరెడ్డి, ఎస్పీ మాధవరెడ్డి

- డీఐజీ అమ్మిరెడ్డి, ఎస్పీ మాధవరెడ్డి
- ముగిసిన పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్
- ఓవరాల్ చాంపియన్‌గా పుట్టపర్తి సబ్ డివిజన్ జట్టు



టగ్ ఆఫ్ వార్‌లో పాల్గొన్న డీఐజీ అమ్మిరెడ్డి

**పుట్టపర్తి టౌన్:** పోలీసులకు నిజ జీవితంలో క్రీడలు ఎంతో ముఖ్యమని, ఆటలో గెలవాలంటే శ్రమతో పాటు సమయస్ఫూర్తి ఉండాలని డీఐజీ అమ్మిరెడ్డి, ఎస్పీ మాధవరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక పోలీస్ పరేడ్ మైదానంలో జిల్లా పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ ముగింపు కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. కార్యక్రమానికి డీఐజీ అమ్మిరెడ్డి, ఎస్పీ మాధవరెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై, గౌరవ వందనం స్వీకరించారు. పలు క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. టగ్ ఆఫ్‌వార్‌లో ఎస్పీ మాధవరెడ్డి జట్టు గెలుపొందింది. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. క్రీడలు మానసిక, శారీరక ఉల్లాసానికి దోహదపడతాయన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సైతం క్రీడలకు అత్యధిక ప్రాధాన్యత నిస్తున్నారని, ఈ క్రమంలో అందివచ్చే ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ జిల్లా కీర్తి ప్రతిష్టలు పెంపొందించేలా క్రీడల్లో రాణించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ విష్ణు, ఏఆర్ డీఎస్పీ విజయకుమార్, అన్ని సబ్ డివిజన్ల డీఎస్పీలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. కాగా, పోటీల్లో పుట్టపర్తి సబ్ డివిజన్ జట్టు రాణించి ఓవరాల్ చాంపియన్ షిప్‌ను దక్కించుకుంది.

**అలరించిన సాంస్కృతిక కార్యాక్రమాలు..**

స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ ముగింపు సందర్భంగా శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కలెక్టర్ అరుణ్‌బాబు, డీఐజీ అమ్మిరెడ్డి, ఎస్పీ మాధవరెడ్డి, ఆర్డీఓ భాగ్యరేఖ హాజరయ్యారు. డీఐజీ స్వయంగా తన హోదాను మరిచి ఉద్యోగుల్లో కలిసిపోయి పాటలకు డ్యాన్స్ చేయడంతో పోలీసు కుటుంబాల్లో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి.